# మూడు ప్రశ్నలు

## పాలంకి వెంకటరామచంద్రమూర్తి

పూర్వం ఒకప్పుడు పారసీక దేశాన్ని ఇబ్రహీం అనే సుల్తాను పరిపాలించాడు.

ఆయన రాజధానిలో ఒక పెద్ద మఠాన్ని కట్టించి, పామరజనాని కందరికీ తెలిసేటట్లుగా అల్లాయొక్క గొప్పతనాన్ని గూర్చి అక్కడ ఉపన్యాసా లివ్వవలసిందని చెప్పి గొప్ప పండితులైన మౌల్వీలను కొందరిని నియమించాడు. ఆ మౌల్వీ లందరికీ పెద్దపెద్ద జీతాలు ఏర్పాటుచేశాడు.

పౌరులంతా వచ్చి రోజూ ఆ ఉపన్యాసాలు విని వెళ్ళవలసిందని సుల్తాను టముకు వేయించాడు. సాయంకాలమయేసరికల్లా లక్షలాది జనం మఠంలో సమావేశమై ఉపన్యాసాలు విని వెడుతుండేవారు. జనం గుంపులుగుంపులుగా వెడుతూ వస్తూ ఉండడం రాజుగారు తమ కోట బురుజుమీద విహరిస్తూ చూసి, మతం వ్యాపించటానికి తాను చేసిన ఆ ఘనకార్యాన్ని తలుచుకుని మురిసిపోయేవాడు.

ఇలా కొంతకాలం గడిచింది. ఒకనాడు సాయంత్రం మఠాన్నుంచి తిరిగి వస్తోన్న గుంపు కనపడటంతోనే సుల్తాను తనపక్కనున్న నౌకరుతో, 'నీవు వెళ్లి ఆగుంపులో ఒక పదిమందిని వెంటబెట్టుకురా' అని పంపేడు.

వాళ్లు రావటంతోనే సుల్తాను, 'మీరు ఉపన్యాసాలు రోజూ విన్న వాళ్ళేకదా' అని అడిగేడు.

'చిత్తం ప్రభూ.'

'ఐతే మతమంటే మీకు ఎంత వరకూ బోధపడిందో పరీక్షిస్తాను. మూడే మూడు ప్రశ్నలు వేస్తాను. మొదటి ప్రశ్న "అల్లా ఎక్కడ ఉన్నాడు?" అన్నది. దీనికి సమాధానం చెప్పండి'అన్నాడు సుల్తాను.

ఆ వచ్చిన వాళ్లు ఒకాళ్ల మొహాలు ఒకాళ్ళు చూసుకోడం మొదలెట్టేరు. ఆయన ఆజ్ఞప్రకారం వెళ్ళి ఉపన్యాసాలు వింటూన్నందుకు తమ్ము మెచ్చుకుని ఆయన బహుమతులిస్తాడని పరుగెత్తుకొని వచ్చినవాళ్లకి ఆయన ఇలా పరీక్ష చేస్తాడని ఏం తెలుసు?

'మీలో ఒక్కరూ కూడా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేరా?' అన్నాడు సుల్తాను. నీళ్ళు నముల్తో అలా నిలబడిపోతే నవాబుకు ఆగ్రహం ఎక్కువౌతుందని తోచి వాళ్ళలో ఒకడు ముందుకు వచ్చి, 'ప్రభూ, తమ ఆజ్ఞానుసారం వెళ్లి వింటున్నామే కాని మాలాంటి వాళ్ళకి ఆ ఉపన్యాసాలు ఏమి అర్థమౌతాయండి? మా అజ్ఞానానికి ప్రభువులుమన్నించి వదిలెయ్యాలి!' అని సాష్టాంగపడ్డాడు.

సుల్తాను ఆశ్చర్యపోయాడు. మరునాడు మరొక పదిమందిని పిలిచి అదే ప్రశ్న వేశాడు. అల్లా ఎక్కడ ఉన్నదీ వాళ్ళలో ఒకడూ చెప్పలేకపోయాడు. ఆమర్నాడు సాయంకాలం ఆయనే ఒక సామాన్యుని దుస్తులలో వెళ్లి మఠంలో జనం మధ్య కూర్చుని మౌల్వీల ఉపన్యాసాలు విన్నాడు.

ఆ మౌల్వీలందరూ గొప్ప పండితులే. మహమ్మదీయ మతగ్రంథమైన ఖురాను వాళ్ళందరికీ కంఠస్థమే. ఆ చదువుకున్నదంతా వాళ్లు తమ ఉపన్యాసాలలో గుచ్చెత్తి వడగళ్ల వానకు మల్లే కురిపించేశారు! సుల్తాను నలువంకలా సభలో వింటూన్న వాళ్లకేసి ఒకసారి చూశాడు. వాళ్ళలో చాలామంది కునికిపాట్లు పడుతో కంటపడ్డారు.

సుల్తానుకు చాలా కోపం వచ్చింది. నిద్రపోతూన్న వాళ్ళ మీద కాదు; ఆ పామరజనానికి అర్థంగాని పద్ధతిలో ఆ ఉపన్యాసాలు దంచుతోన్న మౌల్వీల మీద! ఆయన తారాజువ్వలా లేచి, తాను కప్పుకొనివచ్చిన అంగరఖాను తీసి పారివేసి ఒక్కమారు సింహంలాగ హుంకరించాడు! దానితో కునికిపాట్లు పడుతోన్న వాళ్లంతా ఉలిక్కిపడి లేచి, 'సుల్తాను! సుల్తాను!' అంటూ నిలపడ్డారు.

సుల్తాను మౌల్వీలవైపు తిరిగి, 'వీళ్ళముందు ఖురాను వల్లించమని

# ★ మూడు ప్రశ్నలు ★

వాడు నేను మిమ్మల్ని నియమిస్తా! ఈ సామాన్య ప్రజకు అర్థమయే భాషలో నాలుగు ముక్కలు చెపుతారనుకుంటే మీరు చదివినదంతా వప్పచెపుతున్నారు! ఇంక మీరు ఉపన్యాసాలు ఇవ్వనక్కర్లేదు, పొండి' అని కోప్పడి, పంపేశాడు.

మతంలో ఉపన్యాసకుల పద వులు ఖాళీలయాయని తెలిసి దూర దేశాలనుండి గొప్ప గొప్ప మున్నాను పండితులు వచ్చి, "మాకు ఆ ఉద్యోగం దయచేయవలసింది" అని దరఖాస్తులు పెట్టుకున్నారు. సుల్తాను వాళ్లను ఒక్కొక్కర్నే రప్పించి,"అల్లా ఎక్కడఉన్నాడు?" అన్న తన మొదటి ప్రశ్న వేసే వాడు. వారిలో మొదటి పండితుడు 'ప్రభూ, అల్లా సకల చరాచరాం తర్వర్తి' అన్నాడు. సుల్తాను తన ప్రక్కనున్న నౌకరుతో, 'అజీజ్, ఈయన చెప్పినది నీకు బోధ పడ్డదా?' అన్నాడు.

అజీజు, 'లేదు ప్రభూ'అన్నాడు. ప్రభువు, పండితునివైపు తిరిగి, 'నీ కీ ఉద్యోగం ఇవ్వటానికి వీల్లేదు.' అని పంపేశాడు. తక్కిన పండితులు కూడా అదే ధోరణిలో చెప్పడం, అజీజుకు అల్లా ఎక్కడ ఉన్నదీ బోధపడకపోవడం జరిగి, వాళ్లం దరూ తిరుగుదారి పట్టవలసివచ్చింది.

ఇలాగ ఎందరో రావటం, ఒక్కడూ తృప్తికరమైన జవాబు చెప్పలేకపోవడం జరిగి, కొంతకాల మయేసరికి సుల్తానుకు ప్రాణం విసి గింది. ఇంక ఏ పండితుడు వచ్చినా దర్శనమివ్వడమే మానేశాడు.

ఆఖరి కొకనాడు అరేబియా దేశంనుంచి ఫజల్ అనే విద్వాంసు డొకడు వచ్చి, దర్శన మివ్వవలసిం దని కోరేడు. ప్రభువు ఇవ్వ నన్నాడు. ఇవ్వకపోతే ఈ రాజ ద్వారంవద్దనే ప్రాణాలు విడిచేస్తా నన్నాడు ఫజలు పండితుడు.

ద్వారపాలకుడు వెళ్ళి సుల్తా నుతో ఆ సంగతి మనవి చేశాడు. సుల్తాను ఫజలును రప్పించి, 'నీకు దర్శనమిచ్చాను. నా మూడు ప్రశ్నలకు సరియైన సమాధానాలు గనుక చెప్పకపోతివా నీ ప్రాణాలు తీయించేస్తాను!' అని చెప్పి, 'అల్లా ఎక్కడ ఉన్నాడు? చెప్పు!' అని గద్దించాడు.

ఫజలు, "ఎక్కడేమిటి? అల్లా ఎక్కడ పడితే అక్కడే ఉన్నాడు!" అని చెప్పెయ్యబోయాడు. కాని అలాంటి జవాబులు ఇదివరలో పండితులంతా చెప్పే ఉంటారని, ఆ సమాధానం సుల్తానుకు నచ్చబాటులో ఉండదనీ తోచి, 'ప్రభూ, నా ప్రాణం నా జవాబుమీదైన ఆధార పడి ఉంది గనుక, సమాధానం ఆలోచించి చెపుతాను. గడువు ఇప్పించవలసింది.' అని కోరేడు. ప్రభువు మూడురోజులు గడువు ఇచ్చాడు.

మూడురోజులూ ఇట్టే గడిచి పోయాయి. ఫజలు ఎంత ఆలోచిం చినా మత గ్రంథాలలోని సూత్రా లూ, శ్లోకాలే స్ఫురించాయి కాని అజీజులాంటి సామాన్యులకు బోధ పడే జవాబు చిక్కలేదు. ఫజలు ప్రాణాలు పోతాయన్న బెంగతో చిక్కి శల్యమై, రాజదర్శనం చెయ్య

"అమ్మా, అమ్మా. మన పాపాయి ఎక్కణ్ణించి వచ్చాడే?"

"ఎక్కణ్ణించేమిటి నీ మొహం? దేవుడుదగ్గిర్నించి"

"మరి, దేవుడు పాపాయికి అంటకత్తెర వేసి పంపించాడేం?"

వలసిన నాలుగోరోజు ఉదయం మం చంమీద నుంచి లేవలేకపోయాడు.

ఆలీ అనే అతని నౌకరు ఫజ లుతో 'స్వామీ, మీరు భయం వల్ల జ్వరం వంకపెట్టి తప్పించు కున్నారనిసుల్తాను అనుమానిస్తాడు. మీరు అనుమతి ఇస్తే నేను వెళ్లి కార్యం చక్క పరుచుకొస్తాను'అని చెప్పి, ఆయనను వప్పించి దర్బారు ప్రవేశించాడు.

'నువ్వు నా ప్రశ్నలకు జవా బులు చెప్పగలవా మరి?' అన్నాడు సుల్తాను.

'చెపుతాను కాని ఒక్క మనవి. సంశయాలు అడిగి తెలుసుకొనే వాడు శిష్యభావంతో మెలగాలనీ, చెప్పేవాణ్ణి గురువుగా భావించాలనీ పెద్దలు చెప్పటం తమరు ఎరిగిన విషయమే' అన్నాడు ఆలీ.

సుల్తాను, 'నిన్ను నేను గురు వుగా భావించే అడుగుతున్నాను. చెప్పలేకపోతే మాత్రం నిన్ను ఉరి తీయిస్తాను!' అన్నాడు.

'అట్లే కానివ్వండి. గురువును గనుక నేను పైనా, శిష్యులు క్రిందా కూర్చోవాలి' అన్నాడుఆలీ. సుల్తాను వెంటనే గద్దెనుండి దిగిపోయి, క్రింద నున్న ఒక ఆసనంమీద కూర్చున్నాడు. ఆలీ సింహాసనం

> మేజిస్ట్రేట్: "ఇంత నువ్వు దోషినంటావా, నిర్దోషినంటావా?"
>
> ముద్దాయి: "నాకేం తెలియదండి. మా ప్లీడరుగారి నడగాల్సిందే."

అభిక్షేపించి, 'నేనుసిద్ధంగా ఉన్నాను' అన్నాడు.

సుల్తాను, 'అల్లా ఎక్కడ ఉన్నాడు?' అని ప్రశ్నించాడు.

ఆలీ జవాబు చెప్పకుండా సుల్తాను ప్రక్కనున్న అజీజుతో, 'నీవు పోయి ఒక గిన్నెడు పాలు తీసుకురా' అన్నాడు.

పాలు రావటంతోనే సుల్తానుతో, 'ఈ క్షీరములో వెన్న ఉన్నదా?' అని అడిగేడు.

'లేకేమి?' అన్నాడు సుల్తాను.

'ఎక్కడ ఉందో చూపండి.' అన్నాడు ఆలీ.

'ఈ పళంగా చూడాలంటే వెన్న కనపడదు. కవ్వం తెచ్చి చిలకాలి.' అన్నాడు సుల్తాను.

'అల్లా పాలలో వెన్న వలె అంతటా వ్యాపించి యున్నాడు. అంటే నీ హృదయంలో కూడా ఉన్నాడన్నమాట. ఆయన దర్శనం నీకు కావాలంటే, పాలను చిలికినట్లే నీ హృదయాన్ని కూడా చిలకాలి' అన్నాడు ఆలీ.

సుల్తాను 'శబాష్!' అని మెచ్చుకుంటూ, అజీజువైపు చూశాడు. అజీజు, 'ప్రభూ, అల్లా ఎక్కడున్నదీ నాకిప్పుడు అర్థమైంది.' అన్నాడు.

సుల్తాను, 'రెండవ ప్రశ్న విను. భగవంతుడు ఇప్పుడు ఏవైపు చూస్తున్నాడు?' అని అడిగేడు.

ఆలీ ఒక కొవ్వువత్తిని రప్పించి దానిని వెలిగించాడు. సుల్తాను వైపు తిరిగి, 'ఈ దీపం ఇప్పుడు ఏవైపు చూస్తోంది? తూర్పు వైపా? లేక పడమరా? దక్షిణమా, లేక ఉత్తరమా?' అన్నాడు.

సుల్తాను, 'దీని వెలుగు అన్ని వైపులా వ్యాపిస్తోంది' అన్నాడు.

ఆలీ, 'అట్లే భగవంతుడుకూడా అన్ని వైపులా చూస్తున్నాడు' అని అజీజు వైపు చూశాడు. వాడు, 'నాకు అర్థమైనది' అన్నాడు. సుల్తాను సంతుష్టి చెంది, 'మూడవ ప్రశ్న విను. అల్లా ఇప్పుడేం చేస్తున్నాడు?' అని అడిగేడు.

ఆ సమయానికి ఫజిలు పండితుడు దర్బారు ప్రవేశించాడు. ఆలీఅతణ్ణి చూసి, 'సుస్తీగా ఉండి కూడా మీరు వచ్చారేమి?' అని అడిగేడు. సింహాసనం మీద కూర్చొని యున్న తన నౌకరును చూడటంతోనే ఫజిలు పండితుడు ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. కొంత సేపయాక తేరుకుని, 'ఆలీ, నానిమిత్తం నువ్వు ప్రాణాలను పోగొట్టుకోరాదనిపించి, వచ్చాను' అన్నాడు.

ఆలీ రాజఠీవి కనపరుస్తో, 'అల్లా ఆజ్ఞకానంతకాలం ఎవని ప్రాణం పోదు. మీరు రానేవచ్చారు గనుక, వెళ్లి నౌకర్లు నిలబడే ఆ స్తంభం ప్రక్క, నిలపడండి.' అన్నాడు.

ఫజిలు పండితుడు మళ్లీ ఆశ్చర్యపోయాడు. 'పండితులు కూర్చోవలసిన ఆసనంలో కూర్చోమనటానికి బదులు వీడు నన్ను ఇలాగ నియమిస్తున్నాడేమిటి? ఫేసుకు పెత్తనమిస్తే ఇంతే కామోసు!' అనుకుంటూ విధిలేక పోయి నౌకర్లతో బాటు నిలపడ్డాడు.

ఆలీ సుల్తాను వైపు తిరిగి, 'భగవంతుడేంచేస్తాడో తెలిసిందా?' అన్నాడు.

'నువ్వు చెప్పందే?' అన్నాడు. సుల్తాను.

'మహా విద్వాంసుడైన ఫజిలు పండితుణ్ణి నౌకరుగా చేసి చప్రాసీలమధ్య నిలబెట్టేడు! చప్రాసీనైన నన్ను సింహాసనంమీద కూర్చోబెట్టేడు! సింహాసనాసీనుడై యుండవలసిన సుల్తానును క్రిందకు దింపేడు! అల్లా ఇట్లే పదవులు మారుస్తోంటాడు' అన్నాడు ఆలీ.

ఆలీ మాటలకు సభ్యులంతా హర్షధ్వానులు చేశారు. సుల్తాను సంతోషంతో, 'ఆలీ, నిన్ను మతాధిపతిగా నియమించాను!' అన్నాడు.

ఆలీ గద్దెనుండి దిగి వచ్చి వినయంతో, 'ప్రభూ, ఆ పదవికి ఫజిలు పండితుడు కాని నేను అర్హుడను కాను' అన్నాడు.

సుల్తాను, 'ఫజిలు పండితుడు నా ఆస్థాన పండితుడుగా ఉంటాడు. పామరజనాని కర్థమయేటట్లు బోధ చేసే శక్తి నీకు మాత్రమే కలదు. కనుక నీవే మతాధిపత్యం వహించి, నా ఆశయం నెరవేర్చాలి' అన్నాడు.

★


మంచీ - చెడూ
వెల 2-0-0
పోస్టుఖర్చు ప్రత్యేకం
ఆంధ్రగ్రంథమాల,
మద్రాసు-1.